


# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు

## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!

## ఆల్ ఇన్ వన్

నా దగ్గరే కాని ఏదైనా మాజిక్ పవర్ వుంటే ఏం చేస్తానో తెలుసా ?

ముందు కాలచక్రాన్ని ఓ ఏభైఏళ్ళు వెనక్కి తిప్పేసి మీ మగాళ్ళ బుర్రల్లో నుంచి మీ డిగ్రీలన్నీ వూడలాగేసుకుంటాను. అందర్నీ ఏ అనకాపల్లిలోనో స్కూలుఫైనలు వరకు చదివించి, అమాంతం అమెరికాలో పడేసి ఇప్పుడు చూపించండి మీ ప్రతాపం అంటాను !

గొట్టం పాంట్లు, టెర్లిను షర్టులు వేసుకుని, సిగరెట్లు కాలుస్తూ, సైకిళ్ళు తొక్కుకుంటూ దార్లో కనిపించిన అమ్మాయిలకు సైట్లు కొడుతూ కాలేజీలకెళ్ళి డిగీలు సంపాదించారు. అవి చాలవన్నట్టు ఇక్కడకొచ్చి ఇంకో కట్ట డిగ్రీలు తెచ్చుకొని నాలాంటి ఇల్లాళ్ళ ముందర పెద్ద పోజులు కొడ్తారా ? మీకు చాతనైతే మాలాగా అత్తెసరు చదువులతో వచ్చి చెలామణి అవ్వండి అప్పుడు చూద్దాం ! అదేమంటే చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఇక్కడికొచ్చి ఇంతవాళ్ళమయ్యామని గొప్పలు చెప్పుకుంటారు.

ఆ రోజుల్లో మీ పాకెట్లో పెన్నీ లేకపోతేనేం--- చేతిలో డిగ్రీలకట్ట, పీస్ పాస్ అంటూ నోట్లో ఇంగ్లీష్ భాషా వున్నాయిగా ? ఇక్కడికొచ్చి అక్కడికేదో మీరే అన్ని అవస్థలు పడి అంతా వుద్ధరించినట్లు ఆపసోపాలు పడుతూ క్రెడిట్ అంతా పుచ్చేసుకోవడం !

అమ్మా అబ్బలను అడక్కుండా, కట్టుకున్న పెళ్ళాంతో కన్సల్ట్ చేయకుండా అమెరికా వెళ్ళాలని మీపాటికి మీరు డెసిషన్లు తీసేసుకున్నారు. పైగా పెళ్ళాన్ని పైదేశాలకు తీసికెళ్ళగలిగిన మగాడ్ని నేనే అని అందరిముందు కాలరెత్తుకుని తిరిగారు. వెనకటికి మీలాంటివాడే ఆలికి అన్నం పెట్టడం ఊరికి ఉపకారం అనుకున్నాట్ట !

అసలు ఆ రోజుల్లో నాలాంటి అమ్మాయిలు పెళ్ళెందుకు చేసుకునేవారో తెలుసా ?

పెళ్ళైతే దర్జాగా మొగుడిపక్కన రిక్షాలో కూర్చుని హాయిగా సినిమాలకెళ్ళచ్చని, పెళ్ళైతే పట్టుచీర కట్టుకొని చక్కగా నోములు- పేరంటాలు చేసుకోవచ్చని...... నామటుకు నేను ఎందుకు ఎందుకు చేసుకున్నానో తెలుసా ? పెళ్ళిచేసుకుంటే, మా బామ్మ నాకు మామిడిపిందెల నెక్లెసు చేయిస్తానంది. వెంటనే సరే అన్నాను ! అంతే కాని మిమ్మల్ని మోహించి కాదు.

అట్లాంటి అమాయకపు ఆడపడుచుల్ని వున్నపళంగా ఇక్కడకి తెచ్చి పడేసి మీ చావు మీరు చావండన్నారు ! ఎనాడైనా మా సంగతి పట్టించుకున్నారా ? పక్కన కూర్చోపెట్టుకుని ఇక్కడి భాషా, పధ్ధతులు నెమ్మదిగా నేర్పారా ? తెలివితేటల్లో ఐన్ స్టైన్లము, ఇంగ్లీష్‌లో షేక్స్పియర్లము అనుకున్న మీకే అమెరికా అయోమయంగా అనిపిస్తే, మరి మాలాంటి వాళ్ళ గతి ఏమిటో గ్రహించారా ?
పేరుకు ఆఫీసు పార్టీలకు, గెట్టుగెదర్లకు తీసికెళ్ళినట్టే తీసికెళ్ళి అక్కడ మాఖర్మానికి మమ్మల్ని వదిలేసేవారు. మీపాటికి మీరు మీతెలివితేటల్ని వెళ్ళబోసుకుంటూ జల్సాగా గడిపేవారేగాని పక్కనుండి మాకేమన్నా ధైర్యమిచ్చారా ? అప్పట్లో మీకున్న చదువులూ, డాబులు మాకు లేవనేగా మామీద చిన్నచూపు !

నన్నడిగితే మీకంటే ఇక్కడివాళ్ళే నయం. మీకన్నా వాళ్ళే మమ్మల్ని బాగా అర్ధం చేసుకున్నారు ! అప్పట్లో మీకు 24 గంటలు పని ధ్యాస తప్ప, వేరే ధ్యాస వుండేది కాదు. ఎంతసేపూ మీపేరు ప్రతిష్టల గురించి పాకులాటే కానీ మాసంగతి మీకు పట్టేదికాదు.
మీరొక్కరేకాదులేండి ఆ రోజుల్లో వచ్చిన మగాళ్ళందరూ ఇదే వరస.
పంజరంలో చిలకలా పడివున్న నన్ను చూసినప్పుడల్లా మన పక్కనే వుండే మేరీ నవ్వుతూ విష్ చేసేది ! నేను 'నో ఇంగ్లీష్' అని అన్నా నాతో మాట్లాడుతూనే వుండేది ! ఒకరోజు తన కార్లో మనం వున్న వూరంతా తిప్పింది. ఎక్కడెక్కడ ఏం దొరుకుతాయో అన్నీ వివరంగా చెప్పింది. మిషిన్‌లో డబ్బులు వేసి బట్టలు ఎలా వుతుక్కోవాలో చూపించింది. మావాళ్ళకు నేరాసుకున్న ఉత్తరం నాచేతిలో చూసి, నన్ను పోస్టాఫీసుకు తీసుకెళ్ళి ఉత్తరం డబ్బాలో ఎలా వెయ్యాలో చూపించింది. నాకు ఇంగ్లీష్ మాట్లాడటం రాదని సిగ్గుతో భయపడుతుంటే "డోన్ట్ వర్రీ, యూ విల్ బి ఫైన్" అంటూ నవ్వుతూ ధైర్యమిచ్చేది. నా అన్నవాళ్ళు లేని నాకు ఆ రోజుల్లో మేరీ చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోను. అప్పుడు ఆవిడ ఇచ్చిన ప్రోత్సాహమే ఆ తర్వాత నన్ను ఇంతదాన్ని చేసింది !

అప్పట్లో ఆడవాళ్ళలో ఒకళ్ళూ అరా తప్ప అందరూ కొద్ది చదువుల వాళ్ళే. అయితేనేం తర్వాత ఎంత ఎత్తుకు ఎదిగారో చూడండి. ఈ దేశం వచ్చినప్పుడు రెడీమేడ్ గా మీలాగా మాకు డిగ్రీలు లేకపోయినా నెమ్మదిమీద మేమూ సంపాదించుకున్నాం. ఇష్టమైనవాళ్ళం ఉద్యోగాలు చేసాం. ఇంకొకరి సాయం లేకుండా పిల్లల్ని పెంచి పెద్ద చేసాం. ఆడపని, మొగపని అని తేడా లేకుండా అన్నీ నేర్చుకున్నాం.

ఇప్పుడు ఒక చేత్తో కారు నడపగలం, ఇంకో చేత్తో కాజాలూ చెయ్యగలం.
వు ఆర్ ఆల్ ఇన్ వన్ ! (అన్ లైక్ యూ !)